సాక్షి జగిత్యాల

మంగళవారం । 22 । ఏప్రిల్ । 2025



మార్కెట్ ఆదాయం పెరిగేనా..?

జగిత్యాలలోని చల్‌గల్ మామిడి మార్కెట్‌లో ఏటా కోట్లలో వ్యాపారం జరుగుతున్నా.. మార్కెట్ ఫీజు మాత్రం అంతంత మాత్రంగానే వస్తోంది. - 8లో▸



విద్యార్థులే 'సాగు'లో శాస్త్రవేత్తలు

అవును.. విద్యార్థులే శాస్త్రవేత్తలుగా సలహాలు, సూచనలు అందించనున్నారు. గ్రామ భౌగోళిక స్వరూపాన్ని డయాగ్రామ్ ద్వారా నివేదించనున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
40.0/28.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉదయం నుంచే ఎండవేడిమి పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి వేడిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

ఫసల్ బీమా అమలు చేస్తే రైతులకు పరిహారం అందేది

- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్



నేలకొరిగిన పంటలను పరిశీలిస్తున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమా పథకాన్ని అమలు చేస్తే రైతులకు పంట నష్ట పరిహారం అందేదని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో ఈదురుగాలులు, వడగండ్ల వర్షంతో నష్టపోయిన పంటలను ఎంపీ సోమవారం పరిశీలించారు. పంట నష్టంపై సత్వరమే సర్వే నిర్వహించి ఎకరాకు రూ.50వేల చొప్పున అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరిబాబు, మండల అధ్యక్షుడు బాయి లింగారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నరేందర్‌రెడ్డి, నాయకులు రఘు, సుకేందర్ గౌడ్, వొడ్డెపల్లి శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నృసింహుని సన్నిధిలో ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్



ధర్మపురి దేవస్థానంలో ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేశ్ కుటుంబసభ్యులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని సోమవారం రాష్ట్ర రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేశ్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయం తరఫున చైర్మన్ జక్కు రవీందర్ వారికి స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం అందించారు. జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు పుల్లూరి సత్యనారాయణ, అర్చకులు నంబి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మంచిర్యాల జిల్లా జడ్జి పూజలు

నృసింహస్వామిని మంచిర్యాల జడ్జి అర్పిత దర్శించుకున్నారు. ఈవో శ్రీనివాస్ ఆమెకు స్వాగతం పలికి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందించారు.

తేమశాతం వచ్చిన ధాన్యం కొనండి



సత్తక్కపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

మెట్‌పల్లిరూరల్: తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మెట్‌పల్లి మండలం మేడిపల్లి, సత్తక్కపల్లి గ్రామాల్లో ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కొనుగోళ్లలో జాప్యం చేయవద్దని, రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. రైతులు దళారులకు అమ్మి నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, ఏపీఎం విమోచన, ఏఈవో మనోజ్ఞ, మాజీ ఎంపీపీ సాయిరెడ్డి, నాయకులు ఆరెళ్ల రాజాగౌడ్, గంగాధర్, శ్రీధర్, లింగారెడ్డి, ఖుతుబొద్దీన్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాలు రాకుండా..



భారీ వాహనాలు లోనికి వెళ్లకుండా ఏర్పాటు చేసిన ఇనుప పైపులు

ధర్మపురి: నృసింహస్వామి ఆలయానికి భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. భారీ వాహనాలతో భక్తులు, వ్యాపారులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఈ క్రమంలో నంది చౌరస్తా నుంచి నృసింహుని ఆలయం వరకు.. అక్కడి నుంచి బ్రాహ్మణ సంఘం వరకు భారీ వాహనాలు రాకుండా కట్టుదిట్టమైన ఐరన్ పైపులు అమర్చారు. వాటి వద్ద ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. వీఐపీలు, వికలాంగులు, వృద్ధులకు వెసులుబాటు కల్పించారు. భక్తుల వాహనాలను బ్రాహ్మణసంఘం, నైట్ కాలేజీ వద్ద నున్న పార్కింగ్‌లో పెట్టుకోవాలని సూచించారు. స్థానికులకు షరతులు ఉండవని తెలిపారు.

యూజీడీపై ఆశలు

- రూ.400 కోట్ల అంచనాలతో డీపీఆర్ సిద్ధం
- నిధులు మంజూరుకు కేంద్రానికి ఎమ్మెల్యే వినతి
- పనులు పూర్తయితే పట్టణ ప్రజలకు ఎంతో మేలు

సాక్షి ఫోటోస్ సాక్షి సాక్షి ఫోటోస్

జగిత్యాల:

జిల్లా కేంద్రం.. లక్షకు పైగా జనాభా. 48 వార్డులు.. గ్రేడ్–1 మున్సిపాలిటీ కావడంతో జగిత్యాలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) అత్యంత ఆవశ్యకంగా మారింది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురికినీరంతా రోడ్లపైనే పారుతూ అస్తవ్యస్తంగా మారుతోంది. గత ప్రభుత్వ హయాంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి బీజం పడినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు రూ.400 కోట్ల అంచనాలతో డీపీఆర్‌ను అధికారులు తయారుచేసి ప్రభుత్వానికి పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి పంపితే అనుమతి రాగానే పనులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌తో కలిసి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి శ్రీనివాస్‌ను కలిసి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. జగిత్యాలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టంతోపాటు, యూఐడీఎఫ్ పథకం కింద ఎస్టీపీ సీవరేజీ ప్లాంట్లకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఒకవేళ సెంట్రల్ గవర్నమెంట్ నుంచి నిధులు మంజూరైతే జిల్లా కేంద్రంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు కార్యరూపం దాల్చనుంది.

2017లోనే బీజం..

జగిత్యాల జిల్లాగా మారిన అనంతరం జిల్లాకేంద్రంతోపాటు మెట్‌పల్లి, కోరుట్ల, మున్సిపాలిటీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను అప్పటి ప్రభుత్వం ఆదేశించింది. కొన్ని అనివార్య కారణాలతో అది కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వం మారిన అనంతరం మళ్లీ యూజీడీ వ్యవస్థ ముందుకు వచ్చింది. గతంలో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు యూజీడీ రూపకల్పనకు హైదరాబాద్‌కు చెందిన యూటర్న్ కన్సల్టెన్సీకి అప్పగించారు. ఇందుకు రూ.25లక్షలు కూడా కేటాయించారు. అయినప్పటికీ పనులు పూర్తి కాలేదు. ప్రస్తుతం మళ్లీ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం.. డీపీఆర్ రూ.400 కోట్లతో సిద్ధం చేయడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దీనికి అధికారులు సానుకూలత వ్యక్తం చేసినట్లు తెలిసింది. అలాగే ఢిల్లీలోని కేంద్రమంత్రితో పాటు, కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి శ్రీనివాస్‌ను కలిసి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే, ఎంపీ అర్వింద్‌తో కలిసి కోరారు.



జగిత్యాల వ్యూ

యూజీడీతో మారనున్న రూపురేఖలు

జిల్లా కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తి అస్తవ్యస్తంగా మారింది. వర్షకాలం ఇళ్లలోకి నీరు చేరుతోంది. జిల్లాకేంద్రం కావడంతో చాలా గ్రామాలు ఇందులో విలీనమయ్యాయి. అయితే డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో నిర్మించలేదు. జగిత్యాల సుమారు 5 నుంచి 6 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. లక్షకు పైగా జనాభా ఉన్నా.. యూజీడీ లేకపోవడం గమనార్హం. ఒకవేళ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి వస్తే సిటీ సుందరంగా రూపుదిద్దుకుంటుంది.



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నమూనా

యూజీడీ మంజూరుకు కృషి



జిల్లా కేంద్రంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ కోసం చర్యలు తీసుకుంటున్నాం. రూ.400 కోట్ల అంచనాలతో డీపీఆర్ సిద్ధం చేశాం. రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే యూజీడీ నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే

భూసమస్యల పరిష్కారానికే 'భూ భారతి'

- కలెక్టర్ సత్యప్రసాద్

మెట్‌పల్లిరూరల్: రైతుల భూ సమస్యలన్నింటికీ భూభారతి ద్వారా పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మెట్‌పల్లి శివారులోని ఓ గార్డెన్‌లో భూభారతి చట్టంపై సోమవారం అవగాహన కల్పించారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న సాదాబైనామా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. వీఆర్‌వో, వీఆర్‌ఏలు లేకపోవడంతో రైతుల భూ సమస్యలను గుర్తించేందుకు తహసీల్దార్లకు ఇబ్బందులు ఎదురయ్యాయని, నూతన చట్టంతో గ్రామస్థాయిలోనే సమస్యలు పరిష్కారం అవుతాయని వెల్లడించారు. ఏటా డిసెంబర్ 31న భూభారతి చట్టంలోని రికార్డులను అప్‌డేట్ చేస్తారన్నారు. అనంతరం విట్టంపేట, మెట్లాచిట్టాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మోహన్, డీఆర్డీవో పీడీ రఘువరన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గోవర్ధన్, ఆర్‌ఐలు కాంతయ్య, ఉమేశ్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్, ఆర్డీవో శ్రీనివాస్ తదితరులు

భూములకు రక్షణ కల్పించేందుకే కొత్త చట్టం: విప్ అడ్లూరి

గొల్లపల్లి: భూములకు రక్షణ కల్పించడానికే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భూభారతి పోర్టల్‌ను రైతుల శ్రేయస్సే లక్ష్యంగా రూపొందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రభుత్వ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పాల్గొన్న రైతులు

రాజ్యాంగంతోనే పౌరులకు హక్కులు

- మాజీమంత్రి జీవన్‌రెడ్డి
- బీర్‌పూర్‌లో జైబాపు, జైభీం, జైసంవిధాన్

సారంగాపూర్: అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే ప్రతిపౌరుడు హక్కులను స్వేచ్ఛగా పొందగలుగుతున్నాడని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం బీర్‌పూర్ మండలకేంద్రంలో జైబాపు, జైభీం, జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజ్యాంగప్రతులతో కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. దేశాన్ని ఏలుతున్న బీజేపీ రాజ్యాంగానికి విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తోందన్నారు. పదేళ్లలో బీర్‌పూర్‌లో ఒక్క ఇల్లు కూడా కట్టించలేనోడు ఇప్పుడు కాంగ్రెస్ ముసుగు వేసుకుని.. బీజేపీ బాటలో పయనిస్తూ గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని, సీసీ రోడ్లు, ఇతర పనులను తన అనుయాయులకే కట్టబెడుతున్నాడని, పదేళ్లపాటు పార్టీని కాపాడిన కార్యకర్తల పొట్టగొడుతున్నాడని తెలిపారు. కాంగ్రెస్ అంటేనే రాజ్యాంగానికి లోబడి పనిచేస్తుందని, ముసుగులో వచ్చే వారిని ప్రజలు గమనించాలని కోరారు. రోళ్లవాగు ప్రాజెక్టుకు ఖరీఫ్ నాటికి మూడు గేట్లు బిగించే బాధ్యత తాను తీసుకుంటానని పేర్కొన్నారు. పరిశీలకులు సంగెన భట్ల దినేష్, మహంకాళి రాజన్న, మాజీ ఎంపీపీ మసర్తి రమేశ్, మాజీ జెడ్పీటీసీ ముక్క శంకర్, విండో చైర్మన్ పాల్సాని నవీన్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు చెర్పూరి సుభాష్, గుడిసె జితేందర్, కొండ్ర రాంచంద్రారెడ్డి హాజరయ్యారు.



ర్యాలీగా వెళ్తున్న జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల: జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులను సబ్జెక్టుల వారీగా వృత్యంతర శిక్షణ ఇవ్వడానికి మండల, జిల్లాస్థాయి రిసోర్స్ పర్సన్ల ఎంపికకు విషయ పరిజ్ఞానం, ఆసక్తి గల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రాము కోరారు. మండల రిసోర్స్ పర్సన్లు 8, తెలుగు 2, పరిసరాల విజ్ఞానం 2, ఆంగ్లం 2, గణితం 2, జిల్లాస్థాయి రిసోర్స్ పర్సన్లు 14 అవసరం ఉందని, తెలుగు, 2, పరిసరాల విజ్ఞానం 2, ఆంగ్లం 2, గణితం 2, స్పెషల్ ఎడ్యుకేషన్ 2, ఉర్దూమీడియంలో 2, గణితం 2, ఉన్నత పాఠశాల స్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు 36 మంది రిసోర్స్ పర్సన్లు అవసరమని, తెలుగు 4, హిందీ 4, ఆంగ్లం 4, గణితం 4, భౌతికశాస్త్రం 4, జీవశాస్త్రం 4, సాంఘిక శాస్త్రం 4, పీడీలు 4, స్పెషల్ ఎడ్యుకేషన్ 4 అవసరం ఉందని పేర్కొన్నారు. స్వీయ ధ్రువీకరణ ఇస్తూ డీఈవో కార్యాలయంలో ఈనెల 24 సాయంత్రం 4 గంటలలోపు సమర్పించాలని కోరారు.

వరంగల్ సభకు చలో చలో..

మేడిపల్లి: ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు కోరారు. సోమవారం మండలకేంద్రంలో ముఖ్య నాయకులతో సమావేశమై సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. పార్టీ 25వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా గ్రామగ్రామాన బీఆర్ఎస్ జండా ఎగురవేయాలని, వరంగల్ సభకు తరలిరావాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, చెన్నమనేని అజిత్‌రావు, ఉదిగిరి ఆదిరెడ్డి, మకిలీ దాసు, దేశవేని కృష్ణ, నాంచారి రాజేందర్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు, చిత్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు

బీఆర్ఎస్ సభకు రావాలని కుల సంఘాలకు ఆహ్వానం



కుల సంఘ నాయకులకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

కోరుట్ల: ఈనెల 27 వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఈ మేరకు కోరుట్ల పట్టణంలో సోమవారం పలు కుల సంఘాలు, యువజన సంఘాల నాయకులను కలిసి ఆహ్వాన పత్రికలు అందించారు. కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి ఆశీర్వదించేందుకు రావాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగు చెందారని, అమలు సాధ్యంకాని హామీలిచ్చి ప్రజలను మోసం చేశారని పేర్కొన్నారు. రాష్ట్రానికి మళ్లీ కేసీఆర్ అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు చీమలదండులా కదలాలి

- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

మల్యాల: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు ఊరూరా ప్రజలు, కార్యకర్తలు చీమల దండై కదలిరావాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. మల్యాల మండలకేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం సమావేశమయ్యారు. మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ.. ఏ ఒక్క హామీని కూడా సంపూర్ణంగా అమలు చేయడంలేదని విమర్శించారు. 16నెలల కాంగ్రెస్ పాలనలో రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు, అన్నివర్గాల ప్రజల్లో అసంతృప్తితో ఉన్నారని, ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రజతోత్సవ సభకు తరలివచ్చే ముందు గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొండపల్కల రాంమోహన్‌రావు, మాజీ ఎంపీపీ ఎడిపెల్లి అశోక్, శ్రీలత, మాజీ సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ బోయినపల్లి మధుసూదన్‌రావు, అయిల్నేని సాగర్ రావు, జనగం శ్రీనివాస్ ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గో ఆధారిత వ్యవసాయం లాభదాయకం

గొల్లపల్లి: గో ఆధారిత వ్యవసాయం రైతులకు లాభదాయకంగా ఉంటుందని అఖిలభారత గోరక్ష సహ ప్రముఖ్ ఆకారపు కేశవరాజు అన్నారు. సోమవారం మండలకేంద్రంలో నిర్వహించిన విశ్వహిందూ పరిషత్ కరినగరం విభాగ్ స్థాయి గోరక్ష సమావేశంలో మాట్లాడారు. గోరక్ష నమ్మకం, మతానికి సంబంధించినది కాదని, గో ఆధారిత వ్యవసాయంతో ఆరోగ్యకరమైన, అతి తక్కువ ఖర్చుతో లాభసాటి వ్యవసాయం చేసుకోవచ్చని పేర్కొన్నారు. గో ఉత్పత్తులతో గ్రామస్థాయిలో కుటీర పరిశ్రమలు ఏర్పరచుకుని వాటి ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గోరక్ష ప్రముఖ ఇసంపల్లి వెంకన్న, గోరక్ష రాష్ట్ర కమిటీ సభ్యులు రాధాకృష్ణరెడ్డి, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పద్మాకర్, జిల్లా కార్యదర్శి గజంరాజు, జిల్లా గోరక్ష ప్రముఖ ఆడెపు నరేష్, జంగిలి సత్యం, సాతాల లక్ష్మణ్, తుకారం, వెంకటేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆకారపు కేశవరాజు

- మెట్‌పల్లి మండలంలోని ఓ గ్రామ కార్యదర్శి కొన్ని రోజుల క్రితం జీపీఎఫ్ లోన్ విషయంపై మండల పరిషత్ కార్యాలయంలోని ఓ ఉద్యోగి వద్దకు వెళ్లాడు. ఆ పనికి సంబంధించిన పత్రాలు నిబంధనల ప్రకారం ఉన్నప్పటికీ పెండింగ్‌లో పెట్టాడు. ఎంత బతిమిలాడిన పనిచేయకుండా నెలరోజులకు పైగా తిప్పించుకున్నాడు. చివరకు ఆ కార్యదర్శి తన పైఅధికారి దృష్టికి తీసుకెళ్లాడు. ఆ అధికారి చెప్పినప్పటికీ పనిచేయలేదు. కొద్దిరోజుల తర్వాత 'కొంతమొత్తం' ముట్టచెబితేనే పని చేసినట్లు తెలిసింది.
- మెట్‌పల్లి మండలంలోని మరో కార్యదర్శి వేతనానికి సంబంధించిన విషయంపై సదరు ఉద్యోగి వద్దకు వెళ్లాడు. పెండింగ్‌లో పెట్టి.. చాలారోజుల తర్వాత పనిపూర్తి చేశాడు. ఆ పనికి సంబంధించిన తర్వాతి ప్రక్రియ మరో కార్యాలయంలో జరగాల్సి ఉంది. 'కొంతమొత్తం' ముట్టజెప్పలేదనే కారణంతో మరో కార్యాలయంలో తనకు సన్నిహితంగా ఉండే ఉద్యోగితో ఆ పనిని పెండింగ్‌లో పెట్టించి ఇబ్బందులకు గురిచేయించినట్లు తెలిసింది. ఇలా వీరే కాదు సదరు అధికారి తీరుతో మరికొందరు కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి.

ఆయన రూటే సప'రేటు'

- మెట్‌పల్లి మండల పరిషత్‌లో ఓ ఉద్యోగి ఇష్టారాజ్యం
- కార్యదర్శులకు తలనొప్పిగా ఆయన తీరు
- ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు
- పనుల విషయాల్లో ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు
- ఆయన బాటలోనే మరో కార్యాలయం ఉద్యోగి

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఓ ఉద్యోగి ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. విధుల నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం వహించడమే కాకుండా పంచాయతీ కార్యదర్శులను పలు పనుల విషయంలో ఇబ్బందులకు గురిచేస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఆయన తీరుపై విసుగు చెందిన పంచాయతీ కార్యదర్శులు సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని ఇటీవల పైఅధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే తన పైనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తారా..? అంటూ తన పైఅధికారిని సదరు ఉద్యోగి ప్రశ్నించడం గమనార్హం.

ఎంతో 'కొంత' ముట్టచెబితేనే..

గ్రామ పంచాయతీలకు సంబంధించిన పనుల విషయంలో సదరు ఉద్యోగి వద్దకు వెళ్తున్న కార్యదర్శులు ఎంతో కొంత ముట్టచెబితేనే పనులు జరుగుతాయనేది ఇక్కడ బహిరంగ రహస్యంగా మారింది. ఉద్యోగుల వేతనాలు, సరెండర్ సెలవులు, ఇంక్రిమెంట్లు ,ఐటీ ఫైలింగ్, జీపీఎఫ్ లోన్, అప్పులకు సంబంధించిన పనులు, మిగతా సర్వీస్‌కు సంబంధించిన పనులకు ఎంతో కొంత ముట్టచెప్పాల్సిందే. లేకుంటే ఆ పనులను పెండింగ్‌లో పెట్టి వారిని ఇబ్బందులకు గురిచేయడం పరిపాటిగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. సదరు ఉద్యోగి ప్రతి పనిని పెండింగ్ పెట్టడం, కాసులు ఇస్తేనే పని చేస్తుండడంతో బాధితులందరూ ఇబ్బంది పడుతున్నారు.



మెట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయం

ఇక్కడ పూర్తిచేసి..అక్కడ పెండింగ్..

తన వద్దకు వచ్చిన కొన్ని పనులను తప్పని పరిస్థితుల్లో ఇక్కడ పూర్తి చేస్తున్న సదరు ఉద్యోగి.. ఆ పనికి సంబంధించి చివరి ప్రక్రియ మరో కార్యాలయంలో పూర్తి కావాల్సి ఉంటే అక్కడ తనకు సన్నిహితంగా ఉండే మరో ఉద్యోగితో పెండింగ్‌లో పెట్టించడం.. లేదా ఏదో కారణం చూపుతూ ఉద్దేశపూర్వకంగానే రిజెక్ట్ చేయిస్తున్నట్లు సమాచారం. ఇలా పనులు పూర్తికాకపోవడంతో 'ఫలానా పని పూర్తికాలేదు సార్' అని సదరు ఉద్యోగి వద్దకు వెళ్తే 'నా వద్ద పని పూర్తయింది.. కానీ ఆ కార్యాలయంలో పెండింగ్ ఉంది..' అని చెబుతున్నట్లు తెలిసింది. మరో కార్యాలయంలోని ఉద్యోగి వద్దకు వెళ్తే ఆయన మొదటగా ఏదో కారణాలు చెబుతూ, రోజుల తరబడి తిప్పించుకుంటూ.. ఆ తర్వాత 'చేయి తడిపితేనే' పనులు పూర్తి చేస్తున్నాడని కొందరు 'సాక్షి' దృష్టికి తీసుకువచ్చారు.

షోకాజ్ నోటీస్ జారీ చేశారు

పనుల విషయంలో సదరు ఉద్యోగి ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు కార్యదర్శులు ఫిర్యాదు చేశారు. ఉన్నతధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సదరు ఉద్యోగికి ఇప్పటికే షోకాజ్ నోటీస్ జారీ చేశారు.

– మహేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో, మెట్‌పల్లి

క్లుప్తంగా

చెరువులో మునిగి ఒకరి మృతి

- చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతు


రషీద్(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): చేపలు పట్టేందుకు వెళ్లి.. వ్యక్తి చెరువులో గల్లంతవగా.. మరొకరు సురక్షితంగా బయటపడ్డ సంఘటన ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాలు. కొండాపూర్‌కు చెందిన మహ్మద్ రషీద్(45), బాబా(30) గ్రామ శివారులోని పెద్ద చెరువులోకి చేపలు పట్టేందుకు ఆదివారం రాత్రి వెళ్లారు. ఇద్దరు వలతో చెరువులోకి దిగారు. రషీద్ చెరువులో మునిగిపోయాడు. రషీద్ కోసం బాబా ఎంత గాలించినా ఆచూకీ లభించ లేదు. దీంతో గ్రామంలోకి వెళ్లి విషయం తెలిపాడు. గ్రామస్తులు పెద్దచెరువులో రాత్రి ఎంత గాలించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. సోమవారం సిరిసిల్ల నుంచి గజఈతగాళ్లను రప్పించారు. వారు రషీద్ మృతదేహాన్ని బయటకు తీసుకురావడంతో భార్య షెహనాజ్, కూతురు రేష్మ, కుమారుడు రఫీ, బంధువుల రోదనలు మిన్నంటాయి. రషీద్ ఆరు నెలల క్రితమే దుబాయ్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మూడేళ్ల క్రితం అదే చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి మహ్మద్ ఎక్రామ్ చనిపోయాడు.

విద్యుత్‌షాకుతో రైతు..


విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన రైతు మల్లేశం

బుగ్గారం: పంటకు నీరు పెట్టడానికి వెళ్లి మోటార్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు వైరు తగిలి రైతు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన బుగ్గారం మండలం గోపులాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీధర్, బంధువుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గోవిందుల మల్లేశం(58) సోమవారం ఉదయం పెసరు, నువ్వుల పంటకు నీరు పెట్టడానికి వెళ్లాడు. స్టార్టర్ డబ్బా ఇనుపది కావడంతో సర్వీస్ వైరు మధ్యలో కొద్దిగా కట్ అయిన విషయం తెలియక మోటార్ స్టార్ట్ చేసేందుకు యత్నించాడు. డబ్బాకు అంటిన సర్వీస్ వైరుకు విద్యుత్ సరఫరా అయి రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. మల్లేశం భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీఎంఆర్ చెల్లించాలి



జగిత్యాల: వానాకాలం సీజన్ 2024–25కు సంబంధించి సీఎంఆర్ రోజువారి లక్ష్యం ప్రకారం చెల్లించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. బాయిల్డ్ రైస్‌మిల్లర్లతో సోమవారం సమీక్షించారు. మిల్లు కెపాసిటి ప్రకారం రోజువారి సీఎంఆర్ చెల్లింపులు చేయాలని ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు ఇవ్వాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నివేదిక సమర్పించాలన్నారు. ఎఫ్‌సీఐ అధికారులు సీఎంఆర్ గోదాముల్లో అవసరమైన స్థలం ఏర్పాటు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ లత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులే ‘సాగు’లో శాస్త్రవేత్తలు

- రావెప్‌కు కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలు ఎంపిక
- రైతులతోనే నాలుగు నెలల పాటు క్షేత్రస్థాయి పాఠాలు
- భౌగోళిక స్వరూపం, ప్రదర్శనల రూపకల్పన


సెక్రటరీ హమీద్‌తో మార్కెట్ గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు

కరీంనగర్ అర్బన్: అవును.. విద్యార్థులే శాస్త్రవేత్తలుగా సలహాలు, సూచనలు అందించనున్నారు. అంతర్జాలం ద్వారా అందే సేవలను వివరించడంతో పాటు రైతుల జీవన ప్రమాణాలను రూపొందించనుండగా గ్రామ భౌగోళిక స్వరూపాన్ని డయాగ్రామ్ ద్వారా నివేదించనున్నారు.

గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం (రావెప్)లో భాగంగా వ్యవసాయ విద్యార్థినులు నాలుగు నెలలపాటు గ్రామాల్లోనే బస చేయనున్నారు. కరీంనగర్ ఏరువాక ఆధ్వర్యంలో కార్యాచరణను రూపొందించగా కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాను ఎంపిక చేయగా ఇప్పటికే విద్యార్థులు రైతులతో మమేకమయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యవసాయ కళాశాలకు చెందిన మొత్తం 21మంది విద్యార్థులకు గానూ 4–5గురు విద్యార్థులతో బృందాలను ఏర్పాటు చేసి, మండలానికో గ్రామం ఎంపిక చేశారు. కరీంనగర్ జిల్లాలో కొత్తపల్లి మండలం నాగుల మల్యాల, జగిత్యాల జిల్లాలోని కొడిమ్యాల మండలం పూడూరు, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బోయినపల్లి మండలం తడగొండ గ్రామాల్లో క్షేత్రస్థాయి అనుభవాలను గడిస్తున్నారు. జూన్ వరకు కార్యక్రమాల నిర్వహణతో పాటు అనుభవాలను పొందనున్నారని కరీంనగర్ ఏరువాక సమన్వయకర్త డా.మదన్‌మోహన్‌రెడ్డి వివరించారు.

విత్తు నుంచి కోత వరకు సేవలు

ఒక్కో విద్యార్థినికి ఒక్కో రైతును అటాచ్ చేయగా వివిధ రకాల విత్తనాలు వేసిన నుంచి పంట కోత వరకు సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. విత్తన ఎంపిక, విత్తన శుద్ధితో పాటు పంటలకు ఆశించే చీడపీడల నివారణ, దిగుబడులు ఎక్కువగా వచ్చేందుకు అనుసరించిన యజమాన్య పద్ధతులను శాస్త్రవేత్తల సూచనల క్రమంలో ఫీల్డ్‌లో అమలు చేయనున్నారు. ఎరువుల యాజమాన్యం, పురుగు మందుల వినియోగం పొదుపుగా జరిగేలా సూచనలు చేయనున్నారు. అలాగే ఏ గ్రామంలో సేవలందిస్తున్నారో ఆ గ్రామ నైసర్గిక స్వరూపంతో పాటు వనరులను వివరిస్తూ డయాగ్రామ్ రూపొందించనున్నారు.

యూట్యూబ్, టోల్‌ఫ్రీ సేవలపై ప్రచారం

రైతులు ఆధునిక సాగు పద్ధతులను అనుసరించేలా అంతర్జాల వివరాలపై అవగాహన కల్పించనున్నారు. రైతు వేదికలో ఎప్పటికప్పటి సమాచారాన్ని ప్రదర్శించనున్నారు. గ్రామీణ విశ్లేషణాత్మక తులనం(పీఆర్ఏ)లో భాగంగా సోషల్ మ్యాప్ వేసి గ్రామంలో ఉన్న భౌగోళిక వివరాలు, పోస్టాఫీస్, బ్యాంకులు, ఇతరత్రా వివరాలను రూపొందించనున్నారు. యూట్యూబ్ ఛానల్ ‘పీజేటీఎస్ఎయూ’లో అగ్రికల్చర్ యూనివర్సిటీ వీడియోలు ఉండనుండగా అథెంటిక్‌గా రూపొందించారు. ప్రధాన శాస్త్రవేత్తలు సూచనలు, సలహాలు చూసుకోవచ్చు. రైతుల విజయగాథలు ఉండనుండగా నిర్దిష్టమైన సమాచారం ఉంటుంది. వరి, పత్తి, మొక్కజొన్న, పెసలు, మినుములు, అపరాలు, తృణధాన్యాలపై వీడియోలు ఉండనున్నాయి. కిసాన్ సారథి టోల్‌ఫ్రీ నంబర్ 14426 లేదా 18001232175 ఫోన్ చేసి రైతులు తమ సమస్యలను వివరిస్తే పరిష్కారం చూపనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సేవలందనుండగా రైతులు ఫోన్ చేస్తే ఏ జిల్లా నుంచి చేస్తున్నారో ఆ జిల్లా ఏరువాక, కేవీకే శాస్త్రవేత్తలు లైన్‌లోకి రానున్నారు. ఇక వ్యవసాయ యూనివర్సిటీలు రూపొందించిన విత్తనాలను రైతుల క్షేత్రాల్లో ప్రాక్టికల్‌గా పరీక్షించనున్నారు.

నాలుగు నెలల పాటు సేవలు



మాది సిద్దిపేట. సిరిసిల్ల వ్యవసాయ కళాశాలలో అగ్రి కల్చర్ లాస్ట్ ఇయర్ చదువుతున్న. వ్యవసాయ విద్యార్థులకు తరగతి బోధనలతో పాటు ప్రాక్టికల్ అవగాహన అవసరం. అందుకే నాలుగు నెలల పాటు పంట పొలాలు, రైతుల మధ్య తిరుగుతూ నివేదికలు, మ్యాప్‌లు రూపొందించాల్సి ఉంటుంది.
– పి.స్పందన, అగ్రికల్చర్ విద్యార్థి, సిద్దిపేట

మంచి అవకాశం



మాది కొత్తగూడెం జిల్లాలోని అస్వాపూర్ ప్రాంతం. రైతులతో కలిసి వారి కష్టాలను తెలుసుకోవడం మంచి అవకాశం. అగ్రికల్చర్ విద్య చదవాలని ఆశతో ప్రవేశపరీక్ష రాస్తే సిరిసిల్లలో సీటొచ్చింది. మా నాన్న రమేశ్ ఐటీసీలో ఉద్యోగి. అమ్మ స్వరూపరాణి. వారి ప్రోత్సాహంతో వ్యవసాయ విద్యనభ్యసిస్తున్న.
– బి.జ్యోత్స్న, విద్యార్థి, అస్వాపూర్(కొత్తగూడెం)

ఆధునికత వైపు నడిపిస్తా



నా తల్లిదండ్రులది పూర్తిగా వ్యవసాయ నేపథ్యం. చిన్నతనం నుంచే వ్యవసాయమంటే మక్కువ ఎక్కువ. అందుకే వ్యవసాయ విద్యనభ్యసిస్తున్నా. రైతులను సాంకేతిక సాగువైపు ప్రోత్సహించాలనేది నా అభిలాష.
– పి.స్పందన, విద్యార్థి, గోవిందపూర్, జమ్మికుంట

ఆఫీసులంటే ఎంటో తెలుస్తోంది



అమ్మ,నాన్న ఇద్దరూ ఉద్యోగులే. నాన్న సురేందర్ ఏపీవో కాగా అమ్మ విజయలక్ష్మి టీచర్. పుట్టి పెరిగింది గ్రామీణ నేపథ్యం కావడంతో వివిధ రకాల పంటలను చూసినప్పుడు అగ్రికల్చర్ చదవాలనిపించింది. అనుకున్నదే తడవుగా తల్లిదండ్రులకు చెప్పగా ప్రోత్సహించారు. ఆఫీసులంటే ఎన్ని రకాలో ఇప్పుడు తెలుస్తోంది.
– ఎస్.సోని, విద్యార్థి, మామిడాల(తిప్పర్తి, నల్గొండ)

‘పెద్దింటి’కి అరుదైన గౌరవం


విద్యార్థులకు తన కథలను పాఠాలుగా బోధిస్తున్న పెద్దింటి అశోక్

సిరిసిల్లకల్చరల్: జిల్లాకు చెందిన ప్రముఖ కథారచయిత పెద్దింటి అశోక్‌కుమార్‌కు మరో అరుదైన గౌరవం లభించింది. ఆయన రాసిన జిగిరి, గోస, అనగనగా ఓ కోడిపెట్ట అనే కథలను వరంగల్‌లోని శ్రీవిశ్వేశ్వర సంస్కృతాంధ్ర డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు సిలబస్‌గా ప్రవేశపెట్టారు. ఆయా కథలను బోధించే బాధ్యతను కూడా అప్పగించారు. స్వతహాగా ఉపాధ్యాయుడైన పెద్దింటి కళాశాల విద్యార్థులకు కథలను పాఠాలుగా బోధించారు. ఎనిమిది దశాబ్దాల చరిత్ర గల కళాశాలలో రచయితే అధ్యాపకుడై బోధించడం ఇదే తొలిసారి అని ప్రిన్సిపాల్ సానబోయిన సతీశ్ తెలిపారు. తన కథలపై తానే విస్తృతోపన్యాసం ఇవ్వడం మర్చిపోలేని అనుభవంగా పెద్దింటి అభివర్ణించారు. ఈ సందర్భంగా పెద్దింటిని మానేరు రచయితల సంఘం ప్రతినిధులు, కవులు, రచయితలు అభినందించారు.

అంజన్న ముడుపుల ఆదాయం రూ.1.65లక్షలు


ముడుపులు లెక్కిస్తున్న సేవా సమితి సభ్యులు

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో హనుమాన్ చిన్న జయంతిని పురస్కరించుకుని దీక్షాపరులు స్వామివారికి సమర్పించిన ముడుపులను ఈఓ శ్రీకాంత్‌రావు ఆధ్వర్యంలో సోమవారం లెక్కించారు. మొత్తంగా రూ.1,65,409 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. పర్యవేక్షణ అధికారి ఎం.రాజమౌళి, సునీల్ కుమార్, చంద్రశేఖర్, హరిహరనాథ్, ఏఎస్సై రమణారెడ్డి, పోలీసు సిబ్బంది, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాడి అరెస్ట్

- ఆన్‌లైన్ సెంటర్లు లక్ష్యంగా దందా
- దేశవ్యాప్తంగా 35 ఫిర్యాదులు
- రూ.45లక్షలు మోసం


దాసరి మురళి అరెస్ట్ చూపుతున్న ఎస్పీ

సిరిసిల్లక్రైం: దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ సెంటర్లు లక్ష్యంగా సైబర్ నేరాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాడిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ మహేశ్ బీ గీతే తెలిపారు. మహారాష్ట్రలోని భీవండికి చెందిన దాసరి మురళి మరో నలుగురు ముఠాగా ఏర్పడి ఆన్‌లైన్ సెంటర్లను లక్ష్యంగా చేసుకొని సైబర్‌నేరాలకు పాల్పడ్డారు. నలుగురిని గతంలోనే పోలీసులు అరెస్టు చేయగా దాసరి మురళిని సోమవారం సిరిసిల్లలో అరెస్టు చేశారు. మురళిపై దేశవ్యాప్తంగా 35 ఫిర్యాదులు నమోదుకాగా... రూ.45లక్షల విలువైన సైబర్ నేరాలకు పాల్పడ్డాడు. మురళి భీవండిలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడిపించుకునేవాడు. విలాసాలకు అలవాటు పడి సులభమార్గంలో డబ్బు సంపాదించాలనే ఆలోచనతో తన స్నేహితులు విలేశ్ పటేల్, చిరగ్ రమేశ్‌పేతడ్, జింతేంద్ర సోమాభాయ్, నిలేశ్ జై సింగ్‌లతో ముఠాగా ఏర్పడ్డారు. మొదట ఆన్‌లైన్ సెంటర్ వ్యక్తులకు కాల్‌చేసి తనని తాను ఉన్నత స్థాయి వ్యక్తిగా పరిచయం చేసుకునేవాడు. ఆన్‌లైన్ లావాదేవీలు ఎక్కువగా ఉంటాయని, తమ వాళ్లతో నగదు పంపిస్తానని.. తనకు ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేయాలని నమ్మించి డబ్బు కాజేసేవాడు. అలా వచ్చిన సొమ్మును ఐదుగురు పంచుకునేవారు. దీనిలో భాగంగానే వేములవాడ పట్టణ పరిధిలోని అగ్రహారంలోని ఓ ఆన్‌లైన్ సెంటర్‌ను, సిరిసిల్లలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను లక్ష్యంగా చేసుకొని దాసరి మురళి మోసం చేశాడు. బాధితులు వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన వేములవాడ పోలీసులు స్పెషల్ టీమ్ ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతికత ఆధారంగా విలేశ్‌పటేల్, చిరగ్ రమేశ్ పేతడ్, జింతేంద్ర సోమాభాయ్, నిలేశ్ జైసింగ్‌లను గతంలోనే రిమాండ్ చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న మురళి కోసం వేములవాడ టౌన్ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్, ఎస్సై రమేశ్, సైబర్ టీమ్ ఆర్ఎస్ఐ జునైద్, కానిస్టేబుళ్లు ఇమ్రాన్, షమీ ఆధ్వర్యంలో స్పెషల్ టీం ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా కోరుట్ల బస్ స్టాండ్ వద్ద అరెస్ట్ చేశారు.

హరహర మహాదేవ




వేములవాడ: శివుడికి ప్రీతిపాత్రమైన సోమవారం దాదాపు 50 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల రాకతో వేములవాడలోని వీధులు రద్దీగా మారాయి. ఏర్పాట్లను ఆలయ అధికారులు పరిశీలించారు.

జర్నలిస్టుల పరిస్థితి దుర్భరం

- బీజేపీ అధికారంలోకి వస్తే అన్ని విధాలా ఆదుకుంటాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ వ్యాఖ్యలు


వేములవాడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్

వేములవాడ: రాష్ట్రంలో జర్నలిస్టుల పరిస్థితి దుర్భరంగా ఉందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్న జర్నలిస్టులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. వేములవాడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలో వస్తే జర్నలిస్టులను ఆదుకుంటామన్నారు. జర్నలిజం అనుభవం లేకున్నా యూట్యూబ్ చానళ్ల ముసుగులో బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంపై త్వరలోనే ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి గతంలో రూ.10 లక్షల మేరకు ఎంపీ లాడ్స్ నిధులు మంజూరు చేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్ అధ్యక్షతన బండి సంజయ్‌ని సన్మానించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, నాయకులు ప్రతాప రామకృష్ణ, కుమ్మరి శంకర్, వికాస్‌రావు, బీజేయూ జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్, కార్యదర్శి మహేశ్ పాల్గొన్నారు.

ప్రసాద్ స్కీంలోకి రాజన్న గుడి

వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. ఈ ఏడాది కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. ప్రసాద్ స్కీంలో చేర్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కరీంనగర్‌టౌన్: దేశ చరిత్రలో అంబేడ్కర్ ఎదుర్కొన్న అవమానాలు మరెవరూ ఎదుర్కోలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. తన మేధాశక్తిని అణగారిన వర్గాల అభ్యున్నతికి ధారపోసిన మహనీయుడు అని కొనియాడారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బీజేపీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లో నిర్వహించిన సెమినార్‌కు బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేడ్కర్‌ను దళిత జాతికే పరిమితం చేయాలని కాంగ్రెస్ కుట్ర చేసిందన్నారు. చరిత్ర అంటే డూప్లికేట్ గాంధీ కుటుంబానిదే అన్నట్లుగా విపరీతమైన ప్రచారం చేసుకుని ఆయన్ను తక్కువ చేసిందన్నారు. కాంగ్రెస్ తీరుతో విసుగుచెంది రాజీనామా చేసి బయటకొచ్చి ఎన్నికల్లో పోటీ చేస్తే కమ్యూనిస్టులతో కలిసిన రెండుసార్లు అంబేడ్కర్‌ను ఓడించిందన్నారు. డూప్లికేట్ గాంధీ కుటుంబసభ్యులైన నెహ్రూ, ఇందిరా, రాజీవ్ గాంధీలకు భారతరత్న ఇచ్చుకుందన్నారు. రిజర్వేషన్లను వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు మతపరమైన రిజర్వేషన్లు కల్పించేందుకు కుట్రలు చేసిందన్నారు. అంబేద్కర్‌కు భారతరత్న వచ్చేలా చేసిన పార్టీ బీజేపీ అని అంబేడ్కర్ జయంతి రోజు రాష్ట్రీయ సమరసత దినంగా ప్రకటించి 120దేశాల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు, మానేరు అనంతరెడ్డి, దేవేందర్ రావు, అడవి కుమార్, డాక్టర్ గంగాధర్, రాజేందర్‌రెడ్డి, సోమిడి వేణు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ భవిష్యత్‌కు ఏఐ


నేషనల్ సెమినార్ వేదికపై మాట్లాడుతున్న బాల కిష్టారెడ్డి


సెమినార్‌లో పాల్గొన్న విద్యార్థులు, ప్రొఫెసర్లు

- త్వరలో అందరికీ అందుబాటులోకి ‘కృత్రిమ మేధ’
- గంభీరావుపేట డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నేషనల్ సెమినార్
- హాజరైన రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి
- ఆకట్టుకున్న ప్రొఫెసర్ల పవర్ ప్రెజెంటేషన్లు

గంభీరావుపేట(సిరిసిల్ల): డిజిటల్ భవిష్యత్ మొత్తం ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)పైనే ఆధారపడి ఉంటుందని తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి పేర్కొన్నారు. గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఫిజికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)పై నేషనల్ సెమినార్ కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమానికి పలు రీసెర్చ్ సంస్థల ప్రొఫెసర్లు పాల్గొని పవర్ ప్రెజెంటేషన్‌లు, ప్యానల్ డిస్కషన్, పోస్టర్ ప్రజెంటేషన్ ద్వారా ఏఐ గురించి వివరించారు.

సెమినార్‌లో ఏం చెప్పారంటే..

డిజిటల్ భవిష్యత్‌కు కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) దోహదపడుతుందన్నారు. సాంకేతిక విప్లవాన్ని ముందుకు సాగించే క్రమంలో త్వరలోనే కృత్రిమ మేధ ప్రజలకు అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. సాంకేతికత, ఆవిష్కరణలు ప్రయోగశాలలకే పరిమితం కాకుండా సాధారణ పౌరుల జీవితాలపై సానుకూల ప్రభావం చూపుతూ వారి అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. ఏఐ టెక్నాలజీని వినియోగించుకొని విద్యారంగాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. పోటీ ప్రపంచానికి అనుగుణంగా స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకుంటూ విద్యార్థులు డిజిటల్ భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి, రీసోర్స్ పర్సన్‌లు కల్యాణి, స్వాతి మాతూర్, హంట్ మెట్రిక్ సీఈవో అయూబ్ షేక్, సెమినార్ ఆర్గనైజింగ్ సెక్రటర డాక్టర్ శ్రావణ్‌కుమార్, పరిశోధకులు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మామిడి మార్కెట్ ఆదాయం పెరిగేనా..?

- రూ.కోట్లలో సాగుతున్న వ్యాపారం
- మార్కెట్‌కు ఫీజు మాత్రం అంతంతే
- ఏటా రూ.70లక్షలు దాటని ఆదాయం


గ్రేడింగ్ చేస్తున్న మామిడి కాయలు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాలలోని చల్‌గల్ మామిడి మార్కెట్‌లో ఏటా కోట్లలో వ్యాపారం జరుగుతున్నా.. మార్కెట్ ఫీజు మాత్రం అంతంత మాత్రంగానే వస్తోంది. మార్కెట్ అధికారుల నిర్లక్ష్యంతో వ్యాపారులు ఇష్టారీతిన ఫీజు చెల్లిస్తుండటంతో సరైన ఆదాయం రావడం లేదు. మామిడి మార్కెట్ ఏర్పాటై 20 ఏళ్లు గడుస్తున్నప్పటికీ.. ఆదాయం ఏటా రూ.50లక్షల నుంచి రూ.60లక్షల లోపే ఉండటం అనుమానాలకు తావిస్తోంది.

రూ.కోట్లలో మామిడి వ్యాపారం

చల్‌గల్‌లో మామిడి మార్కెట్ 2005లో సుమారు 23 ఎకరాల స్థలంలో ఏర్పాటైంది. ఈ మార్కెట్‌లో ఏటా రూ.కోట్లలో వ్యాపారం సాగుతుంది. కాయలు కొనుగోలు చేసేందుకు 88 మంది కమీషన్ ఏజెంట్లు, 59 మంది అడ్తిదారులు ఉన్నారు. వీరంతా ప్రతి సీజన్‌లో రూ.200కోట్ల వరకు వ్యాపారం చేస్తుంటారు. సీజన్‌లో ఇక్కడి నుంచి మామిడిని పంజాబ్, హర్యానా, ఢిల్లీ, నాగ్‌పూర్ వంటి ప్రాంతాలకు రోజుకు కనీసం 5 నుంచి 10 లారీలు తరలిస్తుంటారు. పెద్దలారీలో 12 నుంచి 15 టన్నులు, చిన్న లారీలో 8 నుంచి 10 టన్నుల మామిడి ఇతర రాష్ట్రాలకు వెళ్తుంది. ఐదారేళ్లుగా సగటున టన్ను మామిడికాయల రేటు రూ.30 వేల వరకు ఉంది. పెద్ద లారీలో వెళ్లే 15 టన్నుల మామిడికి టన్నుకు రూ.30వేల చొప్పున, రూ.4.50 లక్షలు అవుతుంది. మామిడికాయల కొనుగోలు విలువ ప్రకారం వ్యాపారులు ఒక శాతం మార్కెట్ ఫీజు చెల్లించాల్సి వస్తుంది. దీని ప్రకారం ఒక్కో లారీకి రూ.4500 మార్కెట్ ఫీజు చెల్లించాలి. మామిడికాయ రేటు పెరిగినప్పుడల్లా.. రేటు ప్రకారం మార్కెట్ ఫీజు వసూలు చేయాలి. వ్యాపారులు అధిక రేటు పెట్టి మామిడికాయలు కొనుగోలు చేసినప్పటికీ తక్కువ రేటుకు కొన్నామని చెప్పి ఆ మేరకు అధికారులు మార్కెట్ ఫీజు వసూలు చేస్తున్నారు. ఫలితంగా మార్కెట్ ఫీజుకు గండి పడుతోంది. గతేడాది రూ.63.29లక్షలు మాత్రమే వసూలైంది. 2018లో రూ.71.89 లక్షలు, 2019లో రూ.64.01లక్షలు, 2020లో రూ.69.65 లక్షలు, 2021లో రూ.91.70 లక్షలు, 2022లో రూ.60.90 లక్షలు, 2023 రూ.43.28 లక్షల ఫీజు మాత్రమే వసూలైంది.

ప్రారంభం నామమాత్రం

దివంగత వైఎస్ హయాంలో అప్పటి మంత్రి జీవన్ రెడ్డి పట్టుబట్టి మామిడి మార్కెట్‌ను జగిత్యాలకు తెచ్చారు. రూ.కోట్లు విలువైన వాలంతరీ సంస్థ స్థలాన్ని మార్కెట్‌కు కేటాయించారు. కేసీఆర్ ప్రభుత్వం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఒత్తిడితో మరో 10 ఎకరాలు కేటాయించింది. స్థలంతోపాటు దాదాపు రూ.6కోట్ల నుంచి రూ.7కోట్లతో వ్యాపారుల కోసం షెడ్లు నిర్మించారు. మార్కెట్ ప్రారంభ సమయంలో వ్యాపారులు, రైతులకు మార్కెట్‌ను పరిచయం చేసేందుకు లారీకి రూ.500 నుంచి రూ.వెయ్యి చొప్పున నామమాత్రపు మార్కెట్ ఫీజు వసూలు చేసారు. అదే అదనుగా తీసుకున్న వ్యాపారులు మార్కెట్ ఫీజు చెల్లించేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

నిర్వహణకూ సరిపోని పరిస్థితి

మార్కెట్‌కు వచ్చే ఫీజు నిర్వహణకు సరిపోని పరిస్థితి ఏర్పడింది. కరెంట్ బిల్లులు కూడా మార్కెట్ నుంచే చెల్లించే పరిస్థితి నెలకొంది. విద్యుత్ స్తంభాలు జరపడం, తాగునీటి వసతి కల్పించడం, మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం వంటి పనులు కొన్నేళ్లుగా చేస్తూనే ఉన్నారు. మార్కెట్‌ను పర్యవేక్షించే నలుగురైదుగురు సిబ్బంది జీతభత్యాలు కూడా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. షెడ్ల నిర్మాణానికి మేడ్చల్, ములుగు, నర్సంపేట, కథలాపూర్, లక్సెట్టిపేట మార్కెట్‌ల నుంచి రూ.5.20 కోట్లు అప్పు తెచ్చారు. ఆ అప్పులకు వడ్డీ చెల్లించేందుకు మార్కెట్ ఫీజు సరిపోవడం లేదు.

ఇష్టారాజ్యంగా మార్కెట్ ఫీజు



మామిడి మార్కెట్‌లో ఇష్టారాజ్యంగా మార్కెట్ ఫీజు వసూలు చేస్తున్నారు. ఎంత కాయ కొంటున్నారు..? ఎంత వసూలు చేస్తున్నారు..? ఎవరికీ తెలియదు. మార్కెట్ ఫీజు బుక్కులు చివరకు వ్యాపారులకే ఇస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు. ఈ సారి అలా జరగకుండా చూడాలి.
– బందెల మల్లయ్య, చల్‌గల్, రైతు

పకడ్బందీగా వసూలు చేస్తాం



గతంలో జరిగిన పొరపాట్లు జరగకుండా.. ఈసారి పకడ్బందీగా మార్కెట్ ఫీజు వసూలు చేస్తాం. మార్కెట్ కమిటీ పర్యవేక్షణలో ఉండేందుకే ఏ వ్యాపారికి కూడా మార్కెట్ బయట క్రయ విక్రయాలు చేసేందుకు అనుమతి ఇవ్వడం లేదు. ప్రతిరోజూ వ్యాపారుల దుకాణాలు పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేస్తాం.
– రాజశేఖర్, మార్కెట్ కార్యదర్శి, జగిత్యాల